సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 25 । జూన్ । 2023



ఆషాఢమొచ్చే..ఆనందాలు తెచ్చె..
ఆషాఢ మాసం ప్రారంభమైంది. శూన్య మాసమని వ్యవహరించినా ఎంతో నిండుదనాన్ని కలిగి ఉంటుంది. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశి తోనే పండుగలు ప్రారంభమవుతాయి. 8లో▸



వేధిస్తున్న సిబ్బంది కొరత 9లో▸
నస్పూర్, మందమర్రి మున్సిపాలిటీల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించకపోవడం, కొందరు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఉన్న వారిపై భారం పడుతోంది.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
31.0 /26.0
ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురు గాలులు బలంగా వీస్తాయి. గాలిలో తేమశాతం ఎక్కువగా ఉంటుంది.

మిల్లర్లపై కొరడా !

జైపూర్ మండలంలో ఓ మిల్లు 2021–22 ఖరీఫ్‌కు సంబంధించి 2.96వేల మెట్రిక్ టన్నుల బియ్యం బాకీ ఉంది. మిల్లులో 4.43వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది. ఒక క్వింటాల్ బియ్యం రూ.3548.50 చొప్పున.. రూ.10.53కోట్లు లెక్కగట్టి ఈ మొత్తంపై 12శాతం అపరాధ రుసుం రూ.2.63కోట్లు, మరో 12శాతం వడ్డీ(బకాయి ఉన్న సీఎంఆర్‌పై)తో 12నెలలకు గాను మరో రూ.1.26కోట్లు కలిపి రూ.14.43కోట్ల జరిమానా పడింది. ఇలా జిల్లాలో సీఎంఆర్ ఇవ్వని 19మంది మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ జరిమానాలతో కొరడా ఝులిపించింది. మొత్తం రూ.51కోట్ల జరిమానా విధించింది.



ఓ మిల్లులో బియ్యం(ఫైల్)

- సీఎంఆర్ ఇవ్వని మిల్లులకు భారీ దెబ్బ
- 19మంది మిల్లర్లకు మొత్తం రూ.51కోట్లు జరిమానా
- ఆ మొత్తం చెల్లించేందుకు మిల్లర్ల తర్జన భర్జన
- బియ్యం ఇస్తామంటూ మళ్లీ మంత్రాంగం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అందించడంలో తీవ్ర జాప్యం చేసిన 19 బియ్యం మిల్లులకు పౌరసరఫరాల శాఖ రూ.41.33 కోట్లు జరిమానా విధించింది. అత్యధికంగా ఓ మిల్లుకు రూ.14కోట్లు పెనాల్టీ పడగా, అత్యల్పంగా రూ.14లక్షలు పడింది. ఈ మొత్తాన్ని వాయిదా పద్ధతిలో చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. ఇన్నాళ్లుగా గడువులు పెంచిన ప్రభుత్వం చివరికి జరిమానా విధించడంతో మిల్లర్లు ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే ఐదుగురు మిల్లర్లు ఫైన్ చెల్లించారు. కానీ పెద్ద మొత్తంలో ఉన్న మిల్లర్లు నగదు బదులు బియ్యం ఇస్తామని మంత్రాంగం నడుపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2019నుంచి పలు సీజన్ల సీఎంఆర్ బకాయిలు ఉన్నాయి. ఇందులో జిల్లా నుంచే 2021–22 ఖరీఫ్ సంబంధించి 10.55వేల మెట్రిక్ టన్నుల బియ్యం గత మార్చి 31వరకే ఎఫ్‌సీఐ(జాతీయ ఆహార సంస్థ)కు ఇవ్వాల్సి ఉంది. ఇంకా గడువు పెంచుతారనే ఆశతో నిర్లక్ష్యంగా ఉన్నవారు చివరికి భారీగా రుసుం చెల్లించాల్సి వస్తోంది.

గడువులు పెంచినా మారలే...
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ధాన్యం అందిస్తే, వారు మరాడించి బియ్యం ఇవ్వాలి. ఇందుకు ప్రభుత్వం కమీషన్ ఇస్తుంది. ఆ బియ్యాన్నే ఆహార భద్రత కింద ప్రభుత్వాలు రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అందిస్తున్నాయి. ప్రతీ సీజన్‌లో వేల టన్నుల కొద్దీ వడ్లు మిల్లులకు వెళ్తున్నా సకాలంలో బియ్యంగా తిరిగి రావడం లేదు. కొందరే వందశాతం లక్ష్యం చేరుకుంటున్నారు. చాలామంది సర్కారు నుంచి కమీషన్ రావడం లేదని, విద్యుత్ కోతలు, కూలీలు, మిషనరీల సమస్య, నూక శాతం ఎక్కువ, ఎఫ్‌సీఐ వద్ద బియ్యం పాస్ కావడం లేదంటూ సాకులు చెబుతూ కాలం వెళ్లదీస్తూ వచ్చారు. మిల్లర్ల అసోసియేషన్ విజ్ఞప్తులతో చాలాసార్లు గడువు పెంచారు. అప్పటికీ వినని వారికి నోటీసులు ఇచ్చారు. అయినా వానాకాలం, యాసంగి సీజన్లలో ఎప్పటికప్పుడు వడ్లు ఇస్తున్నారు. ధాన్యం మిల్లులకు చేరడమే తప్ప మళ్లీ బియ్యంగా రావడం లేదు. బకాయి ఉన్న వారికి కొత్త ధాన్యం ఇవ్వబోమని అధికారులు ఒత్తిడి తెచ్చినా కొందరిలో మార్పు రాక జరిమానాలు పడ్డాయి.

వడ్లు అమ్మేస్తూ రూ.కోట్లలో దందా..

ప్రతీ సీజన్‌లో ప్రభుత్వం ఇస్తున్న వడ్లను కొందరు మిల్లర్లు దొడ్డిదారిన అమ్మేసుకుంటూ ఎప్పటికప్పుడు కొత్త సీజన్ల ధాన్యం చూపిస్తూ తప్పుదోవ పట్టిస్తూ వచ్చేవారు. ఈ తేడాలపై పౌరసరఫరాల శాఖ, ఎఫ్‌సీఐ అధికారుల తనిఖీలు జరిగాయి. కాగితాల్లో ధాన్యం నిల్వలు చూపిస్తూ భౌతికంగా తేడా వచ్చిన ఘటనలు ఉన్నాయి. కొందరైతే బియ్యం ఇవ్వడంలో అందరూ పెండింగ్ పెడుతున్నారని, తాము కూడా పెట్టి లాభపడాలనే ఆశతో ఒకరిని చూసి మరొకరు జాప్యం చేశారు. మరికొందరు కనీస మిల్లింగ్ చేయకుండానే రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి మళ్లీ సివిల్ సప్లయికి రీ సైక్లింగ్ చేసిన ఘటనలు ఉన్నాయి. విజిలెన్స్ అధికారులు, రసాయన పరీక్షల్లో నాణ్యత బియ్యం బయటపడ్డాయి. క్వాలిటీ అధికారులను 'మేనేజ్' చేసుకుంటూ బియ్యం పాస్ చేయించుకునేవారు. అలా జిల్లాలో ఓ క్వాలిటీ అధికారి నాణ్యత లేని బియ్యం పాస్ చేసి చివరకు తన ఉద్యోగమే కోల్పోయాడు. నాణ్యత లేకున్నా బియ్యం పాస్ చేయిస్తూ చాలా కాలంగా వడ్లను అమ్మేస్తూ దందా చేస్తున్నారు. భారీగా జరిమానాలు విధించడంతో చివరకు బియ్యం ఇస్తామని అసోసియేషన్, ప్రజాప్రతినిధులతో సర్కారుకు మంత్రాంగం నడిపిస్తున్నారు. మరోవైపు ఇంకా గడువు వస్తదనే ఆశతో ఉండగా, కొందరు ఫైన్లు కట్టేందుకు సిద్ధమయ్యారు. దీనిపై జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నల్మాసు కాంతయ్యను 'సాక్షి' సంప్రదించగా, మిల్లులకు జరిమానాల విషయంపై ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నామని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ టీచర్ల వసూళ్లపై విచారణ



సాక్షి ఎఫెక్ట్..

ఆర్జేడీ ఝాన్సీరాణి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు మే నెలలో వేసవి సెలవుల సందర్భంగా కేంద్రాలకు వెళ్లకుండా ఉండేందుకు డబ్బులు వసూలు చేయడంపై ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన 'అంగన్‌వాడీ టీచర్ల వసూళ్లు?' కథనానికి స్పందన లభించింది. మహిళా శిశు సంక్షేమ శాఖ వరంగల్ ఆర్జేడీ బి.ఝాన్సీరాణి శనివారం విచారణ చేపట్టారు. మంచిర్యాల ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమావేశం శనివారం నిర్వహించగా, ఆకస్మికంగా ఆర్జేడీ ఆ సమావేశానికి హాజరయ్యారు. అంగన్‌వాడీ టీచర్ల నుంచి కొందరు యూనియన్‌కు చెందిన వారు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేసి, ఈ నెల 20వరకు పనిచేసిన సీడీపీవోకు దాదాపుగా రూ.2 లక్షల వరకు చెల్లించినట్లుగా ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. మరికొంత డబ్బులను యూనియన్ పేరిట కొందరు తీసుకుంటున్నట్లుగా వచ్చిన ఆరోపణలు, పత్రికలో వచ్చిన కథనాలను ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. సీడీపీవోగా పనిచేసి ఇటీవలే ఆమె ఇంచార్జి బాధ్యతల నుంచి వైదొలిగి వెళ్లిపోవడంతో, ఆమె స్థానంలో కొత్త సీడీపీవోగా విజయలక్ష్మి విధుల్లో చేరారు. దీంతో ఆర్జేడీ విచారణ నిమిత్తం, ప్రతీ అంగన్‌వాడీ టీచర్‌ను గదిలోకి పిలిపించుకుని రహస్యంగా విచారణ చేపట్టారు. మరికొందరితో ఏం జరిగిందనే దానిపై రాతపూర్వకంగా తీసుకున్నారు. యూనియన్ల పేరిట, గైర్హాజరు, విధుల్లో నిర్లక్ష్యంపై అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సూపర్‌వైజర్లకు, సీడీపీవోలు, ఇతర అధికారులకు గానీ డబ్బులను ఇస్తే, ఇచ్చిన వారిపై తీసుకున్న వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం డబ్బులు వసూలు చేసినట్లు రుజువైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆర్జేడీ తెలిపారు.

న్యూస్‌రీల్

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ప్రతీ ఒక్క సిబ్బందికి సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న ఆశా వర్కర్లకు శనివారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు హెచ్‌బీఏ2ను కేవలం రూ.350లకే చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, కాసర్ల రంజిత్ కుమార్, డీపీహెచ్‌ఎన్, రత్నమాల, సూపర్‌వైజర్‌లు ఆర్‌ఎస్ పద్మ, సరోజ, కమల, పుష్పవల్లి పాల్గొన్నారు.

'ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీబీజీకేఎస్ సిద్ధమే'

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల జాప్యానికి తాము ఏమాత్రం కారణం కాదని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్టు ఎన్నికలను వాయిదా వేస్తూ ఆదేశాలు ఇచ్చిన కేసులో తమ ప్రమేయం ఏమీ లేదని పేర్కొన్నారు. తాము ఎన్నికలు వాయిదా వేయాలని ఎలాంటి కేసు వేయలేదని, కోర్టు ఆదేశాలిచ్చిన కేసులో ఎక్కడా తమ వాదనలు కూడా లేవని తెలిపారు. ఎన్నికలపై గతంలో ఏఐటీయూసీ వేసిన కేసు ఆధారంగా, కంపెనీ తాజాగా వేసిన కేసుతో 2023 ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాలను మాడిఫై చేస్తూ కోర్టు తాజాగా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించింది తమ సంఘమేనని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్మికులు టీబీజీకేఎస్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

'టికెట్ ఎవరికి ఇవ్వాలనేది అధిష్టానం నిర్ణయం'



నియామక పత్రాలు అందిస్తున్న వినోద్

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి టికెట్ ఎవరికి ఇవ్వాలనేది కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తుందని రాష్ట్ర మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం వినోద్ అన్నారు. శనివారం పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో కొందరు స్థానికత సమస్యను తెరమీదికి తెచ్చి తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో పోటీకి టీపీసీసీకి ఎవరైనావిన్నవించుకోవచ్చని, సరైన అభ్యర్థిగా అధిష్టానం భావిస్తే పోటీ చేసే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. అసలు స్థానికత అంశం ప్రాధాన్యత లేనిదని, గత ఎన్నికల్లో తనకు 44 వేల ఓట్లు వచ్చాయని, నియోజకవర్గ ప్రజలు ఆదరించారని అన్నారు. బెల్లంపల్లిలో నివాసానికి గతంలో స్థలం కొనుగోలు చేశానని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆ స్థలంలో ఇల్లు కట్టుకోలేదని తెలిపారు. తిరిగి స్థలం కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నానని అన్నారు. అనంతరం సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సూరిబాబు, చిన్నరాజం, శ్రీనివాస్, మల్లయ్య, రాము, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

బెల్లంపల్లి: వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎం.రాజేశ్వర్‌నాయక్ అన్నారు. శనివారం కేవీకే ప్రాంగణంలో మందుల పిచికారీలో డ్రోన్‌ల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రాజేశ్వర్‌నాయక్ మాట్లాడుతూ పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణకు డ్రోన్ సాయంతో మందును పంటపై పిచికారీ చేయవచ్చని అన్నారు. కేవీకే వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్‌తో మందులను స్ప్రే చేసే డెమో ప్రదర్శించారు. గరుడ ఏరోస్పేస్ ప్రతినిధి రాకేష్, కేవీకే శాస్త్రవేత్తలు కోట శివ కృష్ణ, తిరుపతి, నాగరాజు పాల్గొన్నారు.

సాగు పనులు ముమ్మరం



విత్తనాలు వేస్తున్న కూలీలు

- రుతుపవనాల రాకతో కురుస్తున్న వర్షాలు
- విత్తనాలు వేస్తున్న రైతులు
- పత్తి సాగే ప్రధానం
- విత్తనాలు, ఎరువులు సిద్ధం

మంచిర్యాలఅగ్రికల్చర్: రుతుపవనాల రాక ఆలస్యమైనా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఆనందం కనిపిస్తోంది. గత రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుండడం, ఆరుద్ర కార్తె ప్రారంభం కావడంతో సాగు పనుల్లో రైతాంగం నిమగ్నమైంది. సాగు ఆలస్యమైందని కొందరు ఇప్పటికే విత్తనాలు వేశారు. మరికొందరు దుక్కులు దున్ని సేంద్రియ ఎరువులు వేస్తూ, వ్యవసాయ సామగ్రి, విత్తనాలు సమకూర్చుకునే పనుల్లో ఉన్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 3.63లక్షల ఎకరాలు ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేసి అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశారు. పత్తి, వరి సాగు అధికంగా ఉంటుందని అంచనా వేశారు. సాగుకు అనుకూలంగా కొన్ని మండలాల్లో వర్షాలు పడుతుండడంతో పత్తి విత్తనాలు వేస్తున్నారు. ఈ సీజన్‌లో సాధారణ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు ఆశావాహ దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. ముమ్ముందు వర్షాలు కురుస్తాయో లేదోనని.. వ్యవసాయ పనులు ప్రారంభించాలా..? వద్దా..? అనే సందిగ్ధంలో కొందరు ఉన్నారు. జూన్ 1 నుంచి 23వరకు 118.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం కాగా 34.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. 71 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఇప్పటికే పత్తి, కంది విత్తనాలతోపాటు ఎరువులు వేస్తుండగా.. ఒకటి రెండు భారీ వర్షాలు కురిసి, జలాశయాల్లో నీటినిల్వలు పెరిగిన తర్వాతనే వరి సాగు చేసేందుకు వేచి చూస్తున్నారు.

గతేడాది భారీ వర్షాలు..
గత ఏడాది వానాకాలం ప్రారంభంలో అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఆలస్యంగా జూలైలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో పత్తి పంట, వరినారు దెబ్బతిన్నది. వరినాట్లు ఆగస్టు నెలలో వేసుకున్నారు. ఆలస్యమైనా సాగు విస్తీర్ణం సాధారణ స్థాయికి చేరింది. గతేడాది 3,54,009 ఎకరాల్లో పంటలు సాగు కాగా ఈయేడాది జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేశారు.

సాగు విస్తీర్ణం అంచనా..
పత్తి, వరి, కందులు, పెసలు, మొక్కజొన్న, మినుము, ఇతర పంటలు మొత్తంగా 3,63,828 ఎకరాల్లో సాగవుతాయని ప్రణాళిక రూపొందించారు. సేంద్రియ కర్షనంగా వాడే జీలుగ, జనుము విత్తనాలు మినహా ఇతర ఏ విత్తనాలు రాయితీపై ఇవ్వడం లేదు. పత్తి సాగు అంచనా ప్రకారం 3,59,220 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. సేంద్రియ ఎరువుగా వినియోగించే పచ్చిరొట్ట జీలుగ, జనుము విత్తనాలు 5500 క్వింటాళ్లు తెప్పించి ఇప్పటికే ఆయా మండలాల్లో రైతులకు సరఫరా చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో సాగు అంచనా

పంట	సాగు(ఎకరాల్లో)
పత్తి	2,00,000
వరి	1,59,473
కంది	12,000
పెసర	1,590
మొక్కజొన్న	850
మినుము	305
ఇతర పంటలు	2,000
మొత్తం	3,63,828

గుర్తింపు లేని విత్తనాలు కొనుగోలు చేయొద్దు
రుతు పవనాల రాక కొంత ఆలస్యమైనా వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉంది. రెండ్రోజులుగా జిల్లాలో ఓ మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఒకట్రెండు భారీ వర్షాలు కురిసి నేలలో తేమ ఉన్న తర్వాత విత్తనం వేసుకుంటే మేలు. రైతులు పత్తి సాగుతోపాటు కంది, పెసలు, మినుము, నువ్వుల సాగు చేసుకోవాలి. గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తన రశీదు పంట దిగుబడి వచ్చే వరకు భద్రంగా ఉంచుకోవాలి. ప్రభుత్వ గుర్తింపు లేని విత్తనాలు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కలుపు నివారణ కోసమని గుర్తింపు లేని విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు.
– కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

ఎరువులు..
పంట సాగు అవసరాల మేరకు ఈ ఏడాది 1,05,132 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని గుర్తించారు. ఇందులో యూరియా 49,450 మెట్రిక్ టన్నులు, డీఏపీ 19,200 మెట్రిక్‌టన్నులు, కాంపెక్స్ ఎరువులు 18,000 మెట్రిక్ టన్నులు, పొటాష్ 12,940 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 4,190, జింక్ సల్ఫేట్(జెడ్‌ఎస్‌ఓ4) 1,352 మెట్రిక్‌టన్నులు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటివరకు 18,560 మెట్రిక్ టన్నుల యూరియా, 1,980 మెట్రిక్ టన్నుల డీఏపీ, 960 మెట్రిక్ టన్నుల కాంపెక్స్, 200 టన్నుల ఎస్‌ఎస్‌పీ, 90 టన్నుల పొటాష్ అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

రుణ లక్ష్యం..
గత ఏడాది కంటే ఈసారి రూ.300 కోట్ల మేర రుణ లక్ష్యం పెరిగింది. ఈ ఏడాది రూ.1720.30 కోట్ల రుణాలు అందించాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకొంది. గత ఏడాది రూ.1430.05 కోట్ల మేర రుణ లక్ష్యంగా కాగా.. బ్యాంకర్లు వానాకాలం, యాసంగి కలిపి రూ.1,250 కోట్ల వరకు రైతులకు అందించారు. ఈ ఏడాదైనా సమయానికి రైతుల చేతికి రుణాలు అందిస్తే మేలు జరిగే అవకాశం ఉంటుంది. యేటా రుణ లక్ష్యం భారీగానే పెంచుతున్నా ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం సాగు పెట్టుబడి కింద 'రైతుబంధు పథకం' ద్వారా ఎకరానికి రూ.5 వేల చొప్పున అందించే సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

మరో'సారీ' సర్దుబాటు!?

- ఉపాధ్యాయులకు డిప్యూటేషన్
- వివరాల సేకరణలో విద్యాశాఖ

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా కోట్లాది రూపాయలతో మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళం ఏర్పడుతోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితుల్లో కూడా ఒక్కోసారి సెలవు దొరక్కుండా పోతోంది. పాఠశాలలు పునఃప్రారంభమై 12 రోజులు గడుస్తోంది. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ఎటూ తేలకపోవడంతో గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయుల సర్దుబాటు(డిప్యూటేషన్)కు విద్యాశాఖ ఆలోచన చేస్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండి ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

గతేడాది ఇలా..
విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు సర్దుబాటు చేశారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలపై ఎటూ తేల్చకపోవడంతో ఉపాధ్యాయ ఖాళీల్లో 131 మంది ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌తో నెట్టుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా 683 ప్రభుత్వ పాఠశాలల్లో 41,114మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 487 ప్రాథమిక, 95 ప్రాథమికోన్నత, 101 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 2,839 మంది ఉపాధ్యాయ పోస్టులకు గాను 2,322 మంది మాత్రమే ఉన్నారు. 472 పోస్టులు ఖాళీ ఉన్నాయి. గతంలో ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు విద్యావాలంటీర్ల సేవలను వినియోగించుకున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో విద్యావాలంటీర్ల నియామకం చేపట్టలేదు. బోధనలో ఆటంకం లేకుండా ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌తో సర్దుబాటు చేశారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఇబ్బందులు
సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉదాహరణకు 80 మంది విద్యార్థులు ఉండగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఇద్దరే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొన్ని చోట్ల ఒకరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేశారు. 89 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యావాలంటీర్ల నియామకం చేపట్టకపోవటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది కూడా బదిలీలు, పదోన్నతుల విషయం పెండింగ్‌లో ఉంది. దీంతో సర్దుబాటు చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

చదువులకు ఆటంకం లేకుండా చర్యలు
విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు చేపడుతున్నాం. ఖాళీలను అధిగమించేందుకు విద్యార్థులు తక్కువగా ఉండి ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్(సర్దుబా టు) చేయనున్నాం. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఉపాధ్యాయ వివరాల సేకరణ పూర్తి కాగానే ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తికానుంది.
– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సంఘం నాయకులు

పాతమంచిర్యాల: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక ఐబీ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు తూటి శ్రీనివాస్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను కులం పేరుతో దూషించిన కౌశిక్‌రెడ్డి బేషరతుగా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో మొదటి అమరుడు కృష్ణయ్య ముదిరాజ్ తోపాటు ఎంతోమంది ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఆత్మబలిదానాలు చేశారని, అలాంటి జాతిని కించపరిచే విధంగా మాట్లాడడం సమంజసం కాదని అన్నారు. ముదిరాజ్‌లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో బయట తిరుగనివ్వబోమని, ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు కందుల శ్రీనివాస్, చొప్పరి సారంగపాణి, అనవేణి రాయమల్లు, సూరయ్య, కొలిపాక తిరుపతి, కనుకుంట్ల శ్రీనివాస్, జక్కం నాగేష్ ముదిరాజ్, తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు రెడ్ల శ్రీనివాస్, యువజాగృతి నాయకులు మంచెర్ల సదానందం పాల్గొన్నారు.

గురుకులాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి తెలిపారు. శనివారం బెల్లంపల్లిలోని సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) కళాశాలలో వివరాలు తెలియజేశారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు తాత్కాలిక ప్రాతిపదికన అభ్యర్థులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9గంటలకు బెల్లంపల్లి సీఓఈ కళాశాలలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన, తరగతి గది బోధన పరిశీలన(డెమో) ఉంటుందని వివరించారు.

ఖాళీ పోస్టుల వివరాలు
బాలుర గురుకులాల్లో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జూనియర్ లెక్చరర్స్ విభాగంలో తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. పీజీటీ విభాగంలో హిందీ 1, ఇంగ్లిష్ 4, గణితం 2, ఫిజికల్ సైన్స్ 1, బయోలాజికల్ సైన్స్ 1, సోషల్ 1 ఖాళీగా ఉన్నాయి. టీజీటీ విభాగంలో గణితం, హిందీ, బయోలాజికల్ సైన్స్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయి. బాలికల గురుకులాల్లో జూనియర్ లెక్చరర్స్ విభాగంలో ఇంగ్లిష్ 3, గణితం 1, బోటనీ 1, జువాలజీ 2, కెమిస్ట్రీ 1, ఎకనామిక్స్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీజీటి విభాగంలో ఇంగ్లిష్ 1, సోషల్ 2, టీజీటీ విభాగంలో హిందీ 1 పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి బయోడేటాతో విద్యార్హత జీరాక్స్ ప్రతులతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని ఆర్సీఓ సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను నియమించాలి

పాతమంచిర్యాల: ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు పూర్తి స్థాయిలో సభ్యులను నియమించాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో చైర్మన్‌తోపాటు ఐదుగురు సభ్యులు ఉండాల్సి ఉండగా ఒక సభ్యుడు, చైర్మన్ మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఫలితంగా ఎస్సీ, ఎస్టీలకు రక్షణ, సంక్షేమం పూర్తి స్థాయిలో అందడం లేదని తెలిపారు. న్యాయం కోసం కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఇద్దరిపై కేసు

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ గ్రామానికి చెందిన ఓరం రమేశ్, ఓరం వెంకటేశ్‌లపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన వేముల రాజేశ్ ఓరం రమేష్ వద్ద రూ.20 వేలు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించాడు. అయిన ప్పటికీ రమేశ్ ఇంకా రూ.5 వేలు రావాలని తన అన్న వెంకటేశ్‌తో కలిసి రాజేశ్ ఇంటిపైకి గొడ వకు వెళ్లి ఇంటి తలుపులు పగులగొట్టారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ మోటార్లు దొంగిలించిన ఇద్దరు అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ

జన్నారం(ఖానాపూర్): వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్ మోటార్లను దొంగిలించిన ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చినట్లు లక్సెట్టిపేట సీఐ కృష్ణా రెడ్డి తెలిపారు. జన్నారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మే 31, జూన్ 1 తేదీల్లో జన్నారం మండలం ఇందన్‌పల్లిలో సత్యంరావు, రెంకల స్వామి, రెంకల కుమారస్వామి, రెంకల మల్లేశ్ విద్యుత్ మోటార్లతో పాటు దోభి ఘాట్‌కు అమర్చిన మోటార్ సైతం దొంగిలించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగిలించిన మోటార్లను శనివారం ఆటో ట్రాలీలో జగిత్యాలకు తరలిస్తుండగా ఇందన్‌పల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. ఉట్నూర్ మండలం చిన్నగంగాపూర్‌కు చెందిన గుడిపెల్లి సుధాకర్, భీంరెడ్డి చోరీకి పాల్పడినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో జన్నారం ఎస్సై సతీశ్ పాల్గొన్నారు.

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య


పావని (ఫైల్)

భీమారం(చెన్నూర్): ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని కొత్తగూడెం ఏరియాకు చెందిన పందుల పద్మ, నర్సయ్య దంపతుల కుమార్తె పావని (19) మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. నర్సయ్య మూడేళ్ల క్రితం మృతి చెందాడు. తరచూ తండ్రి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మనస్తాపానికి గురైంది. శనివారం అందరూ బయట కూర్చుని ఉండగానే ఒక్క సారిగా ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.


వేడుకగా గోరింటాకు చూపుతున్న మహిళలు, యువతులు

ఆషాఢమాసం ప్రారంభమైంది. ఎన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు ఈ మాసం సొంతం. శూన్య మాసమని వ్యవహరించినప్పటికీ ఎంతో నిండుదనాన్ని కలిగి ఉంటుంది. ఈ మాసంలో వచ్చే తొలి ఏకాదశితోనే పండుగలు ప్రారంభమవుతాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన బోనాల పండుగను ఈ మాసంలోనే నిర్వహిస్తారు. ఈ యేడు జూన్ 19న ప్రారంభమైన ఆషాఢం జూలై 17తో ముగియనుంది. ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఆషాఢం గురించి కథనం..

– ఆదిలాబాద్/నిర్మల్‌ఖిల్లా

ఆషాఢమొచ్చె.. ఆనందాలు తెచ్చె..!

- పండుగల ఆరంభం ఈ మాసంలోనే..
- పర్వదినాలకు ప్రతీతి
- శుభకార్యాలకు మాత్రమే బ్రేక్

శూన్యమాసం...

తెలుగు సంవత్సరాల్లో నాలుగో నెల ఆషాఢం. పూర్వాషాఢ నక్షత్రంలో కూడిన పౌర్ణమి ఉన్న నెలయే ఆషాఢ మాసం. ఈ మాసంలోనే వర్షఋతువు ప్రారంభమవుతుంది. పౌర్ణమి రోజున చంద్రుడు ఉత్తరాషాఢ/పూర్వాషాఢ నక్షత్రాల సమీపంలోనికి వచ్చే నెలగా తెలియజేస్తారు. ఉత్తరాయన పుణ్యకాలం పూర్తయి సూర్యుడు మిథున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయనం మొదలవుతుంది. దక్షిణాయనం ప్రారంభమైన మాసం కనుక ఆషాఢ మాసం శూన్యమాసం. ఈమాసంలో గృహప్రవేశం వివాహం వంటి శుభకార్యాలు చేయకూడదని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి. అయితే దేవతారాధనలకు, శక్తి ఆరాధనలకు ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంటుంది.

పర్వదినాలు ప్రారంభం

ఆషాఢం అనే పదం 'ఆది' అనే సంస్కృత పదం నుంచి ఉద్భవించింది. ఆది అనగా శక్తి అనే అర్థాన్ని తెలియజేస్తుంది. కావున ఆషాఢ మాసంలో దేవతలను పూజించడం అనేది పరమ పవిత్ర కార్యమని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ఈ మాసంలో పవిత్రమైన పూజలు, వ్రతాలు, రథయాత్రలు, పల్లకీసేవలు అధికంగా జరుగుతుంటాయి. దేశంలోని ప్రముఖమైన పూరి జగన్నాథుని రథయాత్ర సైతం ఆషాఢ మాసంలోనే జరగడం విశేషం. అందుకే ఈ నెలలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతూ ఉంటాయి. పండితులు పూజా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉంటారు. తొలి ఏకాదశి నుంచి పండుగలు ప్రారంభమవుతాయి. ఆషాఢశుద్ధ ఏకాదశి రోజున మహావిష్ణువు పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్లే సందర్భాన్ని తొలి ఏకాదశిగా వ్యవహరిస్తారు. ఆషాఢ శుద్ధపౌర్ణమి రోజున గురుపౌర్ణమిగా పరిగణిస్తారు. ఈ మాసంలో స్కంద పంచమి, 'దక్షిణాయన పుణ్యకాలం' కూడా ప్రారంభమవుతుంది. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాలు ఆషాఢంలోనే అంగరంగ వైభవంగా ఆరంభమవుతాయి. వర్షాకాలం రాకతో ఈ ఉత్సవాలు ప్రారంభం కావడం కొంత శాస్త్రీయతను సైతం కలిగి ఉంటాయి.

గోరింట మెరుపులు

గోరింటాకును అతివలు అమితంగా ఇష్టపడతారు. వాటిని తమ అరచేతుల్లో వేసుకుని ఎర్రగా పండితే మురిసిపోతారు. ఏ పర్వదినాలకైనా శుభకార్యానికైనా గోరింటాకు ఉండాల్సిందే. ముఖ్యంగా ఆషాఢ మాసంలో గోరింటాకు ధరించడం అనేది ఆనవాయితీగా వస్తోంది. గ్రీష్మ రుతువు అనంతరం వర్ష రుతువులో ఆషాఢ మాసం వస్తుంది. ఈ సమయంలో గ్రీష్మ రుతువులో మన శరీరం వేడితో కూడుకుని ఉంటుంది. ఆషాఢంలో బయటి వాతావరణం చల్లబడిపోతుంది. ఈ కారణంగా గోరింటను అరచేతుల్లో ధరిస్తే శరీరంలోని వేడి బయట చల్లబడిన వాతావరణానికి విరుద్ధంగా తయారవుతుంది. చర్మ సమస్యలు కూడా దరి చేరవు. గోరింటాకు శరీరంలో ఉండే వేడిని తగ్గించే శక్తిని కలిగి ఉండడంతో పాటు రోగనిరోధక శక్తిని సైతం పెంచుతుంది. ఆషాఢంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం వలన సౌభాగ్యాన్ని పొందిన వారవుతారని జ్యోతిష్యులు తెలియజేస్తున్నారు.

అమ్మవార్లకు బోనాలు


బోనమెత్తిన మహిళలు, యువతులు

తెలంగాణలో బోనాలకు ఎంతో ప్రాశస్త్యం ఉంది. గ్రామం పట్టణం అనే తేడా లేకుండా ఎవరికి వారు ఎంతో ప్రత్యేకతలతో ఆషాఢ మాసంలో బోనాలు సమర్పిస్తారు. ముందుగా హైదరాబాద్ నగరంలో ప్రారంభమైన బోనాల పండుగ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరుపుకుంటారు. పూర్వకాలం నుంచి గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవార్లకు బోనాన్ని సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. బోనాల పండుగ నిర్వహణ వెనుక ఎంతో శాస్త్రీయత దాగి ఉంది. ఆషాఢమాసంలో వర్షాలు ప్రారంభమై కొత్త నీరు వచ్చి చేరడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ సందర్భంగానే బోనాల ఉత్సవాలు జరుగుతుంటాయి. బోనాల పండుగ నిర్వహణలో భాగంగా బోనం సమర్పించే సమయంలో ఘటాలకు వే పకొమ్మలు కట్టడం, ఇంటిని వేపకొమ్మలతో అలంకరించడం చేస్తుంటారు. వేప గొప్ప క్రి మిసంహారకంగా వ్యవహరిస్తుంది. ఆడపడుచులు తమ ఘటాలకు, పాదా లకు సైతం పసుపును రాసుకుంటారు. ఇది మంచి యాంటీబయాటిక్‌గా పనిచేస్తుంది.

అత్తారింటి నుంచి పుట్టింటికి..

కొత్తగా పెళ్లయిన అమ్మాయిలు ఆషాఢమాసంలో అత్తారింటి నుంచి పుట్టింటికి వెళ్తారు. ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒకరినొకరు చూసుకోకూడదని సంప్రదాయబద్ధంగా వస్తోంది. కొత్తగా పెళ్లై అత్తారింట్లో అడుగిడిన అమ్మాయిలు తల్లిదండ్రులపై బెంగతో ఉంటారు. వీరు ఆషాఢమాసంలో పుట్టింటికి వెళ్లి తోబుట్టువులు, స్నేహితురాళ్లతో కలిసి వేడుకలు జరుపుకుంటారని ప్రతీతి.

మహిళలకు ప్రత్యేకం...



గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు అమితమైన ఇష్టం. మా కాలనీలో మహిళలందరం కలిసి ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటాం. దీనివల్ల చర్మసౌందర్యంతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. మా పూర్వీకుల నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. అందరం కలిసి ఆనందంగా వేడుకల్లో పాల్గొంటాం. అమ్మవారికి పూజలు కూడా చేస్తాం.

– కొప్పుల భారతి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, నిర్మల్

శాస్త్రీయంగా కూడా ప్రయోజనాలు



గోరింటాకును శాస్త్రీయ పరిభాషలో 'లావుసీనియా ఇనెర్మిస్'గా పిలుస్తారు. ఇది 'లైథ్రేసియా' కుటుంబానికి చెందిన ఔషధ గుణాలున్న మొక్క. దీని లేత ఆకులను మెత్తగా నూరి మహిళలు చేతులు, అరచేతులు, పాదాలకు పెట్టుకుంటారు. దీనివల్ల చర్మ సౌందర్యంతో పాటు ఎదుటివారిని ఆకర్షించే వర్ణాన్ని కలిగి ఉంటాయి. దీన్ని చూర్ణంగా చేసి పెట్టుకోవడం వల్ల ఆకులోని వర్ణద్రవ్యం లోగల 'లావుసీన్' అనే రసాయనం ఆరిన తర్వాత ఎరుపు రంగును ఇస్తుంది. ఇందులో చర్మ రోగాలను నివారించే గుణాన్ని కూడా కలిగి ఉంటుంది.

– డాక్టర్ వెల్మల మధు, వృక్ష శాస్త్ర నిపుణులు, నిర్మల్

చర్మ సౌందర్యం ఇస్తుంది



గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మానికి అందాన్నిస్తుంది. మేము మా శ్రీరామ మహిళా సంఘం సభ్యులమంతా కలిసి ఏటా ఆషాఢ మాసంలో గోరింటాకు వేడుకలు ఉత్సాహంగా జరుపుకుంటాం. లేలేత గోరింటాకు తెంపుకుని వచ్చి మెత్తగా నూరి చేతులపై విభిన్న రకాల డిజైన్లు వేసుకుంటాం.

– గన్నారపు అన్నపూర్ణ, నిర్మల్

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు

పాతమంచిర్యాల: జిల్లాలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులు, లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో గణితం, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, సోషల్ సబ్జెక్టులు బోధించడానికి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తిచేసి ఉండాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టులకోసం పీజీ, బీఈ డీ చేసి ఉండాలన్నారు. డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగనుందని, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 28లోగా బయోడేటాను ఎంజేపీలో అందజేయాలని సూచించారు. ఈ నెల 30న గుడిపేటలోని గురుకులంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7993456620 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఏర్పాటయ్యే మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాలల్లో ప్రవేశంకోసం ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంజేపీ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటర్ గోపిచంద్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

బైండోవర్ ఉల్లంఘన కేసులో జరిమానా


జరిమానా పత్రం ఇస్తున్న తహశీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి శనివారం తహశీల్దార్ రాజలింగు జరిమానా విధించారు. మంచిర్యాలకు చెందిన ఉప్పరి నాగార్జునను గతంలో సబ్బెపల్లి గ్రామ శివారులోని భూ వివాదంలో తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నాగార్జున గత బైండోవర్‌ను ఉల్లంఘించి తాజాగా భూ వివాదంలో జోక్యం చేసుకున్నాడు. ఈ మేరకు హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ నాగార్జునను అదుపులోకి తీసుకుని తహశీల్దార్ రాజలింగు ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బైండోవర్ నిబంధనలకు ఉల్లంఘించినందుకు గానూ రూ.25వేల జరిమానా విధిస్తూ తీర్పు చేసిన లేఖను అందజేశారు.

సమావేశాలు ఎందుకు నిర్వహించడంలేదు?

- మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ ఝాన్సీరాణి


మాట్లాడుతున్న ఆర్జేడీ ఝాన్సీరాణి

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతినెలా నిర్వహించాల్సిన అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ కమిటీ (ఏఎల్‌ఎంసి)ని ఎందుకు నిర్వహించడం లేదని మహిళా శిశు, దివ్యాంగ, వృద్ధుల సంక్షేమ శాఖ ఆర్జేడీ బి.ఝాన్సీరాణి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందాల్సిన పౌష్టికాహారం సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల చర్యలు తీసుకుంటోందన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్, కౌన్సిలర్ కమిటీ అధ్యక్షులుగా ఏడుగురితో కలిపి కమిటీని ఏర్పాటు చేసి నెలలో ఒకసారి సమావేశం అయ్యేలా చూడాలన్నారు. కమిటీలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాలను రిజిష్టరులో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. రెండు, మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించుకోవాలన్నారు. పిల్లల గ్రోత్ మానిటరింగ్‌ను చేపట్టి పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్న య్య, సీడీపీవోలు హేమసత్య, విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్‌లు రఘువీర్, రాజేందర్ పాల్గొన్నారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజాసేవ

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


అంబలి పంపిణీ చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేకుండా, తన తండ్రి పేరిట కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో 56 రోజులుగా ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న అంబలి పంపిణీ కేంద్రం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 30 నుంచి ప్రజలకు ప్రతీరోజు మధ్యాహ్నం ఐబీ చౌరాస్తా, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయల మార్కెట్, సీసీసీ, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అంబలితో పాటు, చల్లని తాగునీరు, ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ప్రజలు తనను గెలిపిస్తారని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం


సన్మానిస్తున్న సీటీసీ సంజయ్‌కుమార్ సూర్

జైపూర్: ఎస్టీపీపీలో ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న అధికారులను శనివారం అడ్మిన్ భవన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం(వోసీపీఎస్) వైజీకె.మూర్తి, ఓసీ-3, ఆర్జీ-2 ప్రాజెక్టు ఇంజనీర్ దుర్గాప్రసాద్ ఘనంగా సన్మానించారు. అధికారులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం సూర్యనారాయణరాజు, వోఅండ్ఎం చీఫ్ జెన్సింగ్, ఏజీఎంలు కమలాకర్ భూషణ్, శ్రీనివాస్, డీజీఎం స్టోర్స్ ఎంఎస్‌వీ రమణ, రాయమల్లు, డీజీఎం పర్సనల్ కేసా నారాయణరావు, పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 20 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న కేయూ డిగ్రీ పరీక్షల్లో శనివారం 20 మంది డిబార్ అయినట్లు పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఒకరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలో 9 మంది, పూలాజీబాబా డిగ్రీ కళాశాలలో నలుగురు, ఆజ్మీరా రేఖనాయక్ కళాశాలలో ఒకరు, మంచిర్యాల విద్యానికేతన్ డిగ్రీ కళాశాలో ఇద్దరు, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు చొప్పున డిబార్ అయినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరు మహిళలు కోర్టుకు తరలింపు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బెల్టుషాపుల్లో చొరబడి బాటిళ్లను ధ్వంసం చేయడమే కాకుండా నిర్వాహకులను దుర్భాషలాడిన 11 మందిపై శుక్రవారం ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. శనివారం రామిల్ల రాధిక, బత్తుల సరితను కోర్టుకు తరలించినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పిడుగుపాటుకు యువరైతు మృతి


బిక్కు(ఫైల్)

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన యువ రైతు ధాత్రే బిక్కు(35) శనివారం పిడుగుపాటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బిక్కు తన పంటచేనులో పత్తి విత్తనాలు విత్తేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో బిక్కు సమీపంలోని వేపచెట్టు కింద నిలబడి ఉండడంతో పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మల్లన్నస్వామికి గంగస్నానం



జైపూర్: వేలాల మల్లికార్జునస్వామికి శనివారం గంగస్నానం చేయించారు. ఏటా తొలి ఏకాదశిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఇక్కడ వేడుకలు నిర్వహిస్తారు. తొలిరోజు మల్లన్నస్వామి, కేతమ్మ భ్రమరాంభికలను ఒగ్గు పూజారులు గోదావరికి తీసుకెళ్లారు. ఆదివారం పట్నాలు వేసి స్వామి వారి కల్యాణం నిర్వహిస్తారు.

బహుదూరపు బాటసారులు


గొర్రెల మంద వద్ద గుజరాత్ వాసులు

నెన్నెల(బెల్లంపల్లి): గొర్రెల పెంపకమే వారి జీవనాధారం. వాటి సంరక్షణకు సుదీర్ఘ ప్రయాణమే చేస్తున్నారు. ఇంటిని, కుటుంబ సభ్యులను వదిలి వేల కిలోమీటర్ల దూరం దేశాటన చేస్తున్నారు. ఎక్కడ గ్రాసం ఉంటే అక్కడికి గొర్రెలను తోలుకెళ్తున్నారు. గుజరాత్‌లోని కచ్ ప్రాంతానికి చెందిన 15 మంది గొర్రెల కాపరులు స్థానికంగా గ్రాసం లేకపోవడంతో నెన్నెలకు గొర్రెలను తోలు కొచ్చారు. పొలాల్లో గొర్రెలను మేపుతూ రాత్రివేళ స్థానిక రైతుల పంటచేలల్లో మందలను నిలు పుతూ అందుకు ప్రతిఫలంగా నగదు, బియ్యం తీసుకుంటున్నారు. వంటపాత్రలు, పిండి సామగ్రి గుడారాలకు వాడే కవర్లు, చద్దర్లు, బట్టలను మోసేందుకు ఒంటెలను ఉపయోగిస్తామని నాగ్‌జీబా, మెగాలకాలు వివరించారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు మాత్రమే గుజరాత్ వెళ్తామన్నారు.


ఒంటెలను మేపేందుకు వెళ్తున్న గుజరాత్ వాసి

మహిళను దూషించిన హోంగార్డుపై కేసు

బెల్లంపల్లి: పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన ఓ మహిళను దూషించిన హోంగార్డు సురేష్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై విఠల్ తెలిపారు. కాలనీకి చెందిన గోసిక సుధ ఇంటిని ఆనుకుని సురేష్ దౌర్జన్యంగా ప్రహరీ నిర్మిస్తుండడంతో ఆమె అభ్యంతరం తెలిపింది. ప్రహరీ తొలగించాలనడంతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హోంగార్డు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీగా వెంకటస్వామి

మందమర్రిరూరల్(చెన్నూర్): ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ సెక్రెటరీగా మందమర్రికి చెందిన సీనియర్ నాయకుడు పానుగంటి వెంకటస్వామిని నియమిస్తూ శనివారం యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ జనక్‌ప్రసాద్, కాంపెల్లి, సమ్మయ్య తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.